ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 12.11.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణలో పలు చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తు న్నట్లు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.

2. మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రంలో లక్షా 17 వేల 757 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు.

3. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పథకంలో ఇప్పటి వరకు 2 వేల 900 కోట్ల పైచిలుకు నిధులను లబ్ధిదారుల ఖాతాలో జమ చే సినట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

4. బిజినెస్ రిఫామ్స్ యాక్షన్ ప్లాన్-2024 అమల్లో తెలంగాణ టాప్ ఎచీవర్‌గా నిలిచి కేంద్ర పరిశ్రమలు , అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం అవార్డును అందుకుంది.

**చేప పిల్లలు**

తెలంగాణలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని , ఉచిత పంపిణీ పథకం అవసరాలకు వాటినే వినియోగిస్తామని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకంలో చేపలను ఆహారంగా చేర్చే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. నిన్న హెచ్‌ఐసీసీలో ప్రపంచ ఆక్వాకల్చర్-2025 సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంద ని అ న్నారు. 123 కోట్ల రూపాయలతో ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. దీని కింద 26 వేల నీటి వనరుల్లో 84 కోట్ల చేప పిల్లలు , 10 కోట్ల రొయ్య పిల్లలను చెరువుల్లో వదులుతామని మంత్రి వెల్లడించారు.

డెస్క్

**నష్టం**

మొంథా తుపాను ప్రభావంతో రాష్ట్రంలో పంటనష్టంపై సర్వే పూర్తి అయ్యింది. మొత్తం లక్షా 17 వేల 757 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. వరి పంట 83 వేల 407 ఎకరాలు, పత్తి 30 వేల 144 ఎకరాలు , మొక్కజొన్న 2 వేల 97 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. అత్యధికంగా నాగర్‌కర్నూల్‌లో పంట నష్టం జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. దెబ్బతిన్న పంట వివరాలు కేంద్రానికి పంపి తెలంగాణ ప్రభుత్వం ఎన్‌డీఆర్‌ఎఫ్ కింద నిధులు కోరనుంది.

డెస్క్

**పరిహారం**

కాగా, మొంథా తుపాను ధాటికి కూలిన , దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం నష్ట పరిహారం మంజూరు చేసింది. భారీ వర్షాల ధాటికి రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల్లో 8 వేల 662 ఇళ్లు కూలిపోవడం , దెబ్బతినడం లాంటి నష్టాలు చోటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఒక్కో కుటుంబానికి 15 వేల రూపాయల చొపున దాదాపు 13 కోట్ల రూపాయల నష్ట పరిహారం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డెస్క్

**ఇళ్లు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఇప్పటివరకు 2వేల 900 కోట్ల పైచిలుకు నిధులను లబ్ధిదారుల ఖాతాలో జమ చేశామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారంలోనే 18 వేల మందికి సుమారు 203. కోట్లరూపాయలు చెల్లించామన్నారు. 'ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల 33వేల 69 ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పనుల దశలను బట్టి ప్రతి సోమవారం బిల్లులను విడుదల చేస్తున్నామని ఎండీ గౌతమ్ చెప్పారు.

డెస్క్

**PUBLIC BROADCASTING DAY**

ఈరోజు దేశంలో ప్రజా సేవా ప్రసార దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రతి ఏడాది నవంబర్ 12వ తేదిన మహాత్మా గాంధీ రేడియో ద్వారా దేశ ప్రజలను ఇద్దేశించి చేసిన చారిత్రాత్మక ప్రసంగాన్ని స్మరించుకునేందుకు ప్రజా సేవా బ్రసార

దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1947లో నవంబర్ 12వ తేదీన మహాత్మా గాంధీ ఢిల్లీలోని బ్రాడ్ కాస్టింగ్ హౌస్ ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ప్రజా సేవా ప్రసార దినోత్సవం జరుపుకుంటారు. పాకిస్తాన్ నుంచి నిర్వాసితులై , కురుక్షేత్రంలో తలదాచుకున్న భారతీయులను ఉద్దేశించి దీపావళి పండుగ నాడు మహాత్మా గాంధీ ఆకాశవాణి ద్వారా ప్రసంగించారు. ఆకాశవాణి స్టూడియోలను మహాత్మా గాంధీ సందర్శించడం అదే మొదటిసారి , చివరసాం. ఆనాడు జరిపిన రికార్డింగ్ ను ఇప్పటికీ ప్రసాం భారతి ప్రాచీన రికార్డుల భాండాగారంలో పొందుపరిచి ఉంచారు. 2008లో అప్పటి సమాచార ప్రసార శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ నవంబర్ 12వ తేదీని ప్రజా సేవా ప్రసాం దినోత్సవాన్ని జరుపుకోనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

**NSD**

**యాప్**

రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్స్, గురుకులాల నిర్వహణ , పర్యవేక్షణకు ప్రత్యేక సాఫ్ట్వేర్ రూపొందించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిన్న రాష్ట్ర సెక్రటేరియెట్లో సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సబ్యసాచి ఘోష్ ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ , బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**డెస్క్**

**తనిఖీ**

హైదరాబాద్ లోని నాంపల్లి చేనేత భవన్ లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు ఈ ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం పదిన్నర గంటలకు కూడా కొందరు ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించని ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు.

**పీఎస్**

**సులభతరం**

వాణిజ్యాన్ని సులభతరంగా మార్చేందుకు ఉద్దేశించిన బిజినెస్ రిఫామ్స్ యాక్షన్ ప్లాన్(బీఆర్ఏపీ)-2024 అమల్లో తెలంగాణ రాష్ట్రం నాలుగు విభాగాల్లో విజేతగా నిలిచింది. వ్యాపార ప్రవేశం , నిర్మాణానికి అవసరమైన అనుమతుల జారీ , సేవలు, భూపరిపాలన విభాగాల్లో కేంద్ర పరిశ్రమలు , అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం ఈ అవార్డును ప్రకటించింది. నిన్న ఢిల్లీలో నిర్వహించిన ఉద్యోగ సమాగం-2025 కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ నుంచి తెలంగాణ పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఈ అవార్డును స్వీకరించారు.

**డెస్క్**

**మేడారం**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులపై సమీక్షించేందుకు పలువురు మంత్రులు మేడారం చేరుకున్నారు. ఈ ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ లో బయలుదేరిన రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,

పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క , ఎస్సీ,ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ , ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు కొద్ది సేపటి క్రితం మేడారం చేరుకున్నారు.

**డెస్క్**

**సర్దార్**

యావత్ భారత జాతిని ఏకం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ కు దక్కుతుందని మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ అన్నారు. భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ , ఉమ్మడి మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకల్లో భాగంగా , జిల్లా స్థాయి ఐక్యతా మార్చ్ సంగారెడ్డి పట్టణం లోని ఐ.బి. నుండి కలెక్టరేట్ వరకు జరిగింది.

**పీటీసీ - సంగారెడ్డి**

**న్యుమోనియా**

ఈరోజు ప్రపంచ న్యుమోనియా దినోత్సవం జరుపుకుంటున్నారు. ఈ రోజు న్యుమోనియా గురించి అవగాహన పెంచడం , నివారణ, చికిత్స పద్ధతులను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. న్యుమోనియా అనేది ఒక తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ వ్యాధి. న్యూమెనియా లక్షణాలు కనిపించిన వెంటనే అలసత్వం వహించకుండా , వైద్యుడిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రజిత సూచించారు. ఈ సందర్భంగా ఆకాశవాణితో ఆమె మాట్లాడుతూ.......

**బైట్ - రజిత**

**సిరిసిల్ల**

**వాతావరణం**

రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలియజేసింది. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల దాకా తక్కువగా నమోదు కావొచ్చని పేర్కొంది.

**పీఎస్**

**వేలం**

తెలంగాణ మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ) నిర్వహించిన ఈ-వేలంలో రాయదుర్గం హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ) లో గజం స్థలం 3లక్షల 40వేల రూపాయలు పలికిందని ఆ సంస్థ వైస్ ఛైర్మన్, ఎండీ కె.శశాంక తెలిపారు. 2017లో అదే ప్రాంతంలో 88 వేల రూపాయలు ఉన్న ధర.. ప్రస్తుతం నాలుగు రెట్లు పెరిగిందని వివరించారు.

**డెస్క్**

**కస్తూర్బా**

మంచిర్యాల జిల్లా జైపూర్ లో రెండు కోట్ల యాభై ఐదు లక్షల రూపాయల సమగ్ర శిక్ష నిధులతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలిక జూనియర్ కళాశాల నూతన భవనాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు.

**పిటిసి, మంచిర్యాల**

**కేంద్రం**

జోగులాంబ గద్వాల జిల్లా రేవలపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహిళా సంఘాల సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కార్యక్రమంలో ఏపిఎం లు నరహరి , భీమన్న, దేవనంద్ సీసీలు నవీన్ కుమార్ , లక్ష్మీదేవి,నాగ్యా నాయక్ రైతులు పాల్గొన్నారు.

**పీటీసీ - గద్వాల**